తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

## ప్రతి ఉద్యోగి బాధ్యతలతో...

# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

**-టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి**



తిరుమల, సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని బ్రహ్మోత్సవ డెప్యూటేషన్ సిబ్బందికి టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి సూచించారు. తిరుమల ఆస్థాన మండపంలో శుక్రవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల విధుల కోసం వచ్చిన డిప్యూటేషన్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఉద్యోగులందరికీ పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. ఈసారి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చే అవకాశం ఉన్నందున, గత అనుభవాన్ని ఉపయోగించుకుని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల పట్ల మర్యాదగా, సేవాభావంతో వ్యవహరించి శ్రీవారి బ్రహ్మోత్సవాల ప్రతిష్టను మరింత ఇనుమడింప జేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, ఇన్‌చార్జ్ సిఇ మనోహరం, డిప్యూటీ ఈఓలు భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో...

# యువతకు పెద్దపీట!

**-టికెట్ల ఎంపికలో పారదర్శకత**



**ప్రభాతవార్త-తిరుపతి:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేయాలని తెలుగుదేశం పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొత్త తరం నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రజల్లో చురుగ్గా పనిచేసే యువతను ముందుకు తీసుకురావడం ద్వారా పార్టీకి కొత్త శక్తిని సమకూర్చుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు నాయుడు ఇటీవల పలు సందర్భాల్లో యువత, ముఖ్యంగా "జెన్ జీ" ప్రాధాన్యతను ప్రస్తావిస్తున్నారు. తాను కూడా జెన్ జీ యువత కంటే చురుగ్గా పనిచేస్తున్నానని ఇటీవల వ్యాఖ్యానించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ల సమావేశంలో కూడా అధికారులు ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయకుండా ప్రజల్లోకి వెళ్లాలని, లేకపోతే జెన్ జీ యువత ప్రశ్నిస్తుందని పేర్కొన్నారు. పార్టీలో కూడా మంత్రి లోకేశ్‌తో పోటీపడి పనిచేసే ఉత్సాహం, సామర్థ్యం ఉన్న నాయకులు కావాలని చంద్రబాబు ఆకాంక్షి ంచినట్లు తెలుస్తోంది. మంత్రి లోకేశ్ కూడా పార్టీలో యువతకు మరింత ప్రాధాన్యత కల్పించాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ప్రకటించిన రాష్ట్ర పార్టీ కమిటీలో సీనియర్లతో బాటు పెద్ద సంఖ్యలో యువతకు అవకాశం కల్పించడం కూడా ఇందుకు సంకేతంగా భావిస్తున్నారు. తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల పదవుల కోసం పలువురు యువ నాయకులు ఇప్పటి నుండే ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ పదవిని దక్కించుకునేందుకు పలువురు యువకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అదేవిధంగా శ్రీకాళహస్తి, పుత్తూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ పదవుల కోసం కూడా యువ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని ఎంపీపీ, జెడ్పీటీసీ పదవుల్లో కూడా అధిక సంఖ్యలో యువతకు అవకాశం కల్పించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీసీలకు కల్పిస్తున్న 34 శాతం రిజర్వేషన్లలోనూ యువత, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ, బీసీ మహిళా రిజర్వేషన్ స్థానాల్లోనూ చురుగ్గా పనిచేసే యువతకు అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు పార్టీ పలు అంశాలను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, ప్రజా సమస్యలపై స్పందించే స్వభావం, సేవా దృక్పథం, నిరంతర కృషి, పార్టీ పట్ల విధేయతతో పాటు ప్రజల్లో మంచి పేరు ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే రాజకీయ పార్టీలకు దూరంగా ఉన్న విద్యావంతులు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తటస్థులను కూడా రంగంలోకి దింపాలని పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయగలిగిన వారికంటే ప్రజాదరణ, వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజలతో సంబంధాలు ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంచి అభ్యర్థుల ఎంపిక కోసం జిల్లాకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీకి సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకుల ఒత్తిళ్లకు లోనుకాకుండా పారదర్శక విధానాన్ని అనుసరించాలని పార్టీ అధిష్ఠానం సమాచారం. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే వారికే అవకాశం కల్పించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి పొత్తులో భాగంగా కొన్ని స్థానాలను జనసేన, బీజేపీకి కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ, జిల్లాలో మెజారిటీ స్థానాల్లో టిడిపి పోటీ చేసే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఇరువురు నకిలీ...

# టీటీడీ సూపరింటెండెంట్‌లు అరెస్ట్

తిరుపతి క్రైం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ఇరువురు వ్యక్తులు నకిలీ టీటీడీ సూపరింటెండెంట్ అవతారం ఎత్తి విఐపీ దర్శనాలు, గదులపేరిట 42 వేలరూపాయలు కాజేసిన సైబం నేరగాళ్ళను తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఈస్ట్ సిఐ శ్రీనివాసులు సమాచారం మేరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో అధికారుల పేర్లువాడుకుంటూ, విఐపీ దర్శనాలు చేయిస్తామని, రూములు ఇప్పిస్తామని చెప్పి సాయం కోసం వచ్చే భక్తులను మోసగిస్తున్న ఘటనపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుపతికి చెందిన ప్రైవేట్ లెక్చరర్‌కే అజయ్ ప్రసన్నకుమార్‌కి సుమారు 45 రోజుల క్రితం నిందితుడు ఫోన్ కాల్ చేశాడు. తాను జూనియర్ చిన్నంగారి రమణ అని, ప్రస్తుతం టీటీడీలో సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ వచ్చి పని చేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. తిరుమలలో తనకు విఐపీ/వివిఐపీ బ్రేక్ దర్శనం కోటా ఉందని నమ్మబలికాడు. మోసగాడి మాటలు నమ్మిన అజయ్ ప్రసన్నకుమార్, జూలై 25న తిరుమలలో రూములు విఐపీ దర్శనం టికెట్ల కోసం వ్యక్తి సూచించిన పసపాల శరత్‌కుమార్ పేరిట ఉన్న ఫోన్ పే నంబరుకు 10 వేల రూ పంపించారు. అనంతరం ఆగస్టు 2న నెల్లూరు చైతన్య ప్రిన్సిపాల పిజిపి కృష్ణ ద్వార 7 వేల రూ మోకటి సుబ్రహ్మణ్యం ఫోన్ పేకు మరో 5 వేల రూపాయలు పంపించారు. ఈ విధంగా విడతలవారీగా మొత్తం 22 వేల రూపాయలు నిందితులు కాజేశాడు. అంతేకాకుండా, బాధితుడి బంధువైనడి విజయవర్ధనకి కూడా రూములు ఇప్పిస్తానని చెప్పి అతని నుండి మరో 20 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా వేయించుకున్నాడు. అయితే భక్తులు తిరుమలకు చేరుకున్నా కగదులుగానీ, దర్శనంగానీ ఇప్పించకుండా రాత్రి వరకు తిప్పుతూ తీవ్రమానసిక ఆందోళనకు గురిచేశాడు. అనంతరం విజయవర్ధన్ తిరుమలలో పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతనికి 20 వేలు తిరిగి ఆన్‌లైన్ ద్వారా పంపి, డబ్బు పంపినట్లు నకిలీ స్క్రీన్ షాట్లు పెట్టి మోసం చేశాడు. బాధితుడుకే అజయ్ ప్రసన్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నకిలీ టీటీడీ సూపరింటెండెంట్ రమణ, మోకటి సుబ్రహ్మణ్యంలపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల ఫోన్ నంబర్లు, బ్యాంక్ ఖాతా వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశామని వెల్లడించారు. అయితే ఈస్ట్ సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ టీటీడీ విఐపి దర్శనాలు, గదుల కేటాయింపు పేరిట అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు అడిగితే నమ్మవద్దని, కేవలం అధికారిక టీటీడీ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సేవలను పొందాలని సూచించారు.

# కలెక్టర్‌ను...అభినందించిన సిఎం

**- ఒసాట్ ప్రాజెక్టుకు సిఎం అభినందనలు- ప్రాజెక్టు వివరాలను సిఎంకు వివరించిన కలెక్టర్**

చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల రెండవ రోజు సదస్సులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సదస్సులో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని పాఠశాల విద్యలో డిజిటల్ మౌళిక వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థుల అభ్యాసన ప్రమాణాలను పెంపొందించేందుకు చేపట్టిన నూతన పైలెట్ ప్రాజెక్ట్ వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ సిఎంకు వివరించారు. కర్నాటక రాష్ట్రంకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో రూ.2 కోట్ల నిధుల విరాళంతో జిల్లాలో ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో ఈ పైలెట్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. 'వన్స్ స్కూల్ ఎట్ ఎ టైమ్'(ఓఎస్ఇటి) పేరిట డిజిటల్ స్కూల్ మౌళిక వసతులు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు ల్యాప్ టాప్‌లు, ట్యాబ్‌లు, ఐఎఫ్ ప్యానెళ్ళు, ప్రత్యేక టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌లను అదించడంతో పాటు పర్యవేక్షణకు 10 మంది వాలంటీర్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మైక్రోసాఫ్ట్ అజూర్ ఓపెన్ ఏఐ ప్లాట్‌ఫారమ్ ఆధారంగా మన పాఠ్యాంశాలను ట్యాబ్‌లలో అనుసంధానించామని, తరగతి బోధన అనంతరం చివరి 10-15 నిముషాల్లో ప్రయాంప్ట్‌లు, ఎంసిక్యూలు, గేమ్‌లు, వీడియోల ద్వారా విద్యార్థులకు క్లిష్టమైన విషయాలను సులభంగా అర్థమయ్యేలా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రారంభంలో ఒక్కో పాఠశాలకు రూ.10 లక్షల వరకు వ్యయమైనప్పటికీ ప్రస్తుతం అందుబాటులో వున్న సాంకేతికత ద్వారా రూ.4 నుండి రూ.5 లక్షల తక్కువ ఖర్చుతో జిల్లా పరిషత్, డిఎంఎఫ్ నిధులతో ఇతర పాఠశాలలకు సైతం ఈ ప్రాజెక్టును విస్తరించవచ్చునని ప్రతిపాదించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించిన విషయాలపై సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం 'ఏఐ టీచర్' వంటి ఆధునిక సాంకేతికలను ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. చిత్తూరు మోడల్‌తో పాటు ఇతర సాంకేతిక మోడళ్ళను సమగ్రంగా అధ్యయనం చేసి వాటి ప్రభావం, వ్యయంను పరిశీలించాలని పాఠశాల విద్యాశాఖ అధికారులను సిఎం ఆదేశించారు.

## ఆరు నెలల్లో 120 కోట్లతో మున్సిపాలిటీలో...

# కనివినీ ఎరుగని అభివృద్ధి

**- సుమారు 120 కోట్లతో అన్ని మౌలిక వసతుల ఏర్పాటు- రోడ్లు, డ్రైన్లు, తాగునీటికి ప్రాధాన్యత - పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేపట్టిన ఎమ్మెల్యే అమర్**




పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి

పలమనేరు రూరల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ఆరు నెలల వ్యవధిలో రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్లు, లైట్లు వంటి అన్ని మౌలిక వసతుల పనులను పూర్తి చేసి మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తామని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బొమ్మిదొడ్డి, నీలకుంట, శ్రీనగర్ కాలనీ, విద్యానగర్ కాలనీ, గుడియాత్తం రోడ్డు, గడ్డురు, బోరెడ్డిపల్లి కాలనీ, పోలీస్ లైన్, టీఎస్ అగ్రహారం, లక్ష్మీ నగర్ ప్రాంతాలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లో భాగంగా ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు మరియు ప్రారంభోత్సవాలు చేపట్టారు. అనంతరం బోరెడ్డిపల్లి కాలనీవాసులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మున్సిపాలిటీలో సుమారు 120 కోట్లతో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బోరెడ్డిపల్లి కాలనీలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వ నిధులు, డిఎంఎఫ్, బిపిఎస్/ఎల్ఆర్ఎస్, టౌన్ ప్లానింగ్, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద దాదాపు 2.6 కోట్లు ఒకే విడతగా మంజూరు చేశామన్నారు. గతంలో 2018లోనే మంత్రిగా ఉన్న సమయంలో సిఐపిపి (క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్) కింద 50కోట్లు మంజూరు చేసినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పనులు చేయకుండా నిలిపివేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని, ఈ నెల 26వ తేదీ నాటికి టెండర్లు పూర్తయి మిగిలిన అన్ని పనులు ఏకకాలంలో వేగవంతం అవుతాయని తెలిపారు. పట్టణం, కాలనీ విస్తరణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో పైప్‌లైన్లు, కొళాయి కనెక్షన్ల కోసం 15 కోట్లు మంజూరు కాగా, అందులో 2.20 కోట్లు పెద్ద చెరువు సుందరీకరణకు, మిగిలిన నిధులను కొత్త పైప్‌లైన్లకు కేటాయించడం జరిగిందన్నారు. పలమనేరు ప్రాంత శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2,820 కోట్లతో సమగ్ర వాటర్ గ్రిడ్ పథకాన్ని తెచ్చారని, హంద్రీనీవా, గాలేరు నగరి ద్వారా శ్రీశైలం నుంచి గండికోట మీదుగా నీటిని తరలించి నిరంతర సరఫరా అందిస్తామని వివరించారు. ప్రస్తుతం కౌండిన్య ప్రాజెక్ట్ బోర్లు ఎండిపోయినప్పుడు వచ్చే తాగునీటి ఎద్దడికి ఇది శాశ్వత పరిష్కారంగా మారుతుందన్నారు. మురుగునీటి శుద్ధి కేంద్రం, పట్టణ మురుగునీరంతా పెద్ద చెరువు, బొమ్మిదొడ్డి చెరువులోకి చేరి కలుషితం కాకుండా నివారించడానికి 15 కోట్లతో ఎస్టీపీ మంజూరు చేశామని తద్వారా శుద్ధి చేసిన నీటిని దిగువ ప్రాంతాల్లోని రైతులు పంట పొలాల సాగుకు నిరభ్యంతరంగా వాడుకోవచ్చని తెలిపారు. ఏదేమైనా పలమనేరు మున్సిపాలిటీ అన్ని విధాలా కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందనుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసారు.

# నేరాల నియంత్రణలో...సాంకేతికత వినియోగం భేష్!

**-ప్రజాక్షేత్రంలో కలెక్టర్ పనితీరు అభినందనీయం-తిరుపతి ఎస్పీ,కలెక్టర్‌లతో సిఎం చంద్రబాబునాయుడు**



ముఖ్యమంత్రి సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ, కలెక్టర్

తిరుపతి,సెప్టెంబర్ 11ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం... స్మార్ట్‌సిటీ తిరుపతి జిల్లాలో నేరాల నియంత్రణలో పోలీసుశాఖ ఆధునిక సాంకేతికత వినియోగిస్తుండటం మంచి ఫలితాలినిస్తోందని ఇదే స్ఫూర్తితో మరింత రెట్టింపుగా పనితీరు సాగించాలని సిఎం చంద్రబాబునాయుడు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడును అభినందించారు. ఇప్పటికే తిరుపతి జిల్లాలో గంజాయి నిర్మూలన, మత్తు పదార్థాల వినియోగం చాలావరకు అరికట్టారని పేర్కొన్నారు. పోలీసులు మరింత చురుగ్గా, అప్రమత్తతతో వ్యవహరించి పూర్తిస్థాయిలో నేరాలకట్టడి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. తిరుపతి జిల్లాలో మారుమూల గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్ళి వారితో మమేకమవడమేగాక వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారని సిఎం కితాబిచ్చారు. ఎల్‌నినో తీవ్రతపై, తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని, రైతుల సమస్యలు, భూములకు సంబంధించిన సమస్యలపై మరింత శ్రద్ధ చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సూచించారు. వీలైనంతవరకు క్షేత్రస్థాయిలో ప్రజలతో కలసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంపై అదనంగా దృష్టిసారించాలని సిఎం నిర్దేశం చేశారు. చంద్రగిరి మండలం నారావారిపల్లిలో పిఎం సూర్యఘర్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించి వారిని ఆ దిశగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో ,రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సిఎం తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో శ్రద్ధ చూపాలని, ప్రజల్లో సానుకూలత పెంచాలని వెల్లడించారు. ప్రభుత్వ పాలనలో ప్రజా సంతృప్తే పరమావధిగా పనిచేయాలని, దీనికోసం ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సిఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పాలనలో టెక్నాలజీ వినియోగం పెరగాలన్నారు., పీజీఆర్ఎస్‌కు వచ్చే దరఖాస్తులను ప్రజలకు పూర్తి సంతృప్తి కలిగేలా పరిష్కరించాలన్నారు. నెలకు నాలుగుసార్లు మీ జిల్లా పరిధిలో క్షేత్రస్థాయికి వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రజల కోసం తీసుకువస్తున్న ఎన్నో పథకాలు, పాలసీలు సులభంగా అందించినప్పుడే ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుందని సిఎం పేర్కొన్నారు.

# జర్మనీలో పరిశోధనా అవకాశాలపై...యస్వీయూలో కార్యశాల



అంతర్జాతీయ పరిశోధనా అవకాశాలపై అవగాహన సదస్సు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: అంతర్జాతీయ పరిశోధనా అవకాశాలపై విద్యార్థులు, పరిశోధకులకు అవగాహన కల్పించడంతో పాటు సమర్థవంతమైన ప్రాజెక్టు ప్రతిపాదనలు రూపొందించేలా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైరాలజీ విభాగం ఆధ్వర్యంలో కార్యశాలను నిర్వహి ంచారు. జర్మనీలో పరిశోధనా అవకాశాలు, ప్రాజెక్టు ప్రతిపాదన రచన అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో నిపుణులు పలు సూచనలు అందించారు. విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఓ.వి.ఎస్. రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ పరిశోధనా అవకాశాలను విద్యార్థులు, పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు విదేశీ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో సహకారానికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు.చెన్నైలోని డీఏఏడీ సమాచార కేంద్ర ప్రాంతీయ అధికారిణి ఆచార్య ఆంటోనెట్ స్టీఫెన్ జర్మనీలో ఉన్నత విద్య, పరిశోధనకు ఉన్న అవకాశాలు, విద్యార్థులు- పరిశోధకులకు అందుబాటులో ఉన్న మార్గాలు, విద్యా-పరిశోధనా సహకారాలకు డీఏఏడీ అందిస్తున్న సహకారం గురించి వివరించారు.తిరుపతి ఐఐఎస్ఈఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ వసుధారాణి దేవనాథన్ ప్రాజెక్టు ప్రతిపాదనను ఎలా రాయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. పరిశోధన సమస్యను గుర్తించడం, లక్ష్యాలను రూపొందించడం, పరిశోధనా పద్ధతిని వివరించడం, ఆశించిన ఫలితాలను పేర్కొనడం, పరిశోధన ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేయడం వంటి అంశాలను వివరించారు.కార్యశాలకు యస్వీయూ అధ్యాపకులతో పాటు వివిధ విభాగాలకు చెందిన పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు. వైరాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్. రంజని కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు. ఆచార్యులు హేమ, చరితాదేవి, జి. నరసింహ, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ జేర్వాణ జ్యోతి, డాక్టర్ సుమతి, అశోక్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా సోలార్ విద్యుత్‌కు చర్యలు

**- రెస్కో చైర్మన్ ప్రతాప్‌కుమార్**



కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ పథకంలో భాగంగా కుప్పంలో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ వెలుగులు అందించేలా చర్యలు చేపట్టినట్లు రెస్కో చైర్మన్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలో పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సోలార్ ప్లాంట్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రెస్కో పరిధిలో సుమారు 8వేలమంది ఎసీ స్,ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ కనెక్షన్లు అందించామన్నారు. మరో 37వేల కుటుంబాలకు సైతం రాయితీతో సోలార్ కనెక్షన్లు అందించనున్నట్లు చెప్పారు. ప్రజల ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో ఇళ్ల అవసరాలకు అవసరమైన విద్యుత్ వినియోగంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించవచ్చన్నారు. సమావేశంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, నేతలు డాక్టర్ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో పూర్తికావస్తున్న...

# బ్రహ్మోత్సవ ఏర్పాట్లు






కాణిపాకం ఆలయ బ్రహ్మోత్స ఏర్పాట్లు

కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో ఈనెల 14 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లు శరవేగంగా సాగుతూ తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. దేవస్థానంలో ఈనెల 14 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం గత నెల రోజుల నుండే ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఈఏర్పాట్లును శరవేగంగా నిర్వహిస్తు న్నారు. ఇప్పటికే ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలం కరణ, తాత్కాలిక షెడ్లు, గణేష్‌దీక్ష మండపం ఏర్పాటు, రథం మరమ్మత్తులు వంటి పనులు పూర్తి కావస్తుండంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దాదాపు పూర్తవుతోంది. మిగిలిన చిన్న చిన్న ఏర్పాట్లును రెండు రోజుల్లోగా పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అలాగే ఆలయ పరిసరాలు, ఇతర ప్రాంతాల్లో విద్యుద్దీపాల కటౌట్‌లు, ఆర్చిల ఏర్పాటుకు రాత్రంబవళ్ళు కార్మికులు శ్రమిస్తున్నారు.అలాగే ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లుకు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశ అభివృద్ధి

**- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవికుమార్**

బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం బ్యాంకులో వివిధ సంస్థలు అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తే దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడు తుందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవికుమార్ తెలిపారు. నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో 25 మంది మహిళలకు మూడు నెలల కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని నవజీవన్ సమస్త మహిళా డైరెక్టర్ విక్టోరియా ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, వెంకటగిరి సబ్ ఇన్స్పెక్టర్ స్వరూపాలు శుక్రవారం ప్రారంభించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ నవజీవన్ సమస్త మహిళల అభివృద్ధి కోసం అనేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించుతూ ఈ కార్యక్రమంలో మహిళలు ఆర్థిక అభివృద్ధి చేపడుతున్న కార్యక్రమాలు అమోఘమని తెలిపారు. జిల్లా యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మొగలేశ్వర మాట్లాడుతూ తమ బ్యాంకు పరిధిలో మహిళలకు వివిధ రంగాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీరికి ఉచిత భోజన వసతితో పాటు స్టైఫండ్ కూడా ఇస్తున్నామని అనంతరం వారి వ్యాపార అభివృద్ధికి రుణాలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ స్వరూప మాట్లాడుతూ ఈరోజు నవజీవన్ సమస్త మహిళలు స్వయం సమృద్ధి కొరకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. నవజీవన్ సంస్థ ఫౌండర్ కాల్వపల్లి సహదేవయ్య మాట్లాడుతూ తమ సమస్త మహిళల సాధికారత కోసం గత 30 సంవత్సరాల నుండి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. టైలరి ంగ్‌లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ప్రతి మహిళ ఆర్థికం గా ఎదగడానికి తమ వంతు సహాయ సహకారాలు అంది స్తామని తెలిపారు మహిళలకు తమ సమస్త ఇచ్చే సూచనలు పూర్తయిన వెంటనే మహిళలు ఆర్థికంగా నిల తొక్కుకోవడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్లు టీ ఉమాపతి, జి కృష్ణ నవజీవన్ సమస్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లావణ్య, సమస్త కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వివిధ నైపుణ్య అభివృద్ధి పొందినవారికి రుణాలు అందిస్తామని తిరుపతి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవికుమార్ తెలిపారు.



## 66 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కమిషనర్



బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: 36 వార్డులకు గాను పట్టణంలో 66 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల జాబితాను ఆయన విడుదల చేశారు. పట్టణంలో 44 వేల140 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వివరాలను అన్ని పార్టీల నాయకులకు కూడా తెలియజేసి వారి సూచనలు సలహాలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో 36 వార్డుల ఏర్పాటు అందరి సూచనలు సలహాలు మేరకు చేసినట్లు తెలిపారు. కొన్ని మార్పులు చేరుకునే విషయమై కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టిపిఒ సాయి లీల పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి గుర్తింపునకు ఇంటింటి సర్వే



బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించనున్నట్లు బాలాయ పల్లి వైద్యాధి కారిణి జి.లికిత, జయంపు వైద్యాధికారిణి టి.లియోనా తెలిపారు. ఈ సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు సమన్వ యంతో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించను న్నారు. ముఖ్యంగా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించి, ఇంటికి వచ్చే సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని అందించాలని అధికారులు కోరారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి సత్తా చాటాలి : నేదురుమల్లి



బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జెఆర్ భవనంలో ఆయన నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ఏకగ్రీవ ఎందుకు ఛాన్స్ లేదని తెలిపారు. ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పిటిసిలను జగన్మోహన్ రెడ్డికి కానుక ఇవ్వాలని తెలిపారు. జగన్మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకునే లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. పార్టీలో పని అయిన వారికి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి గుర్తింపు ఉండదని తెలిపారు. ఆనం రామాలయం రెడ్డి ఇక్కడ ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గాన్ని నాశనం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ సభ్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత రెడ్డి, మున్సిపల్ విభాగం కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మండల కన్వీనర్లు శ్రీనివాసులు రెడ్డి,ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు దశరథ రామ్‌రెడ్డి, సతీష్, రాజారెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన అంగన్వాడి...మన బాధ్యత



తడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : తడ మండలం తడ సత్రం అంగన్వాడీ కేంద్రం నందు శుక్రవారం 9వ జాతీయ పోషణ మాస అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ గర్భవతులకు బాలింతలకు చిన్నపిల్లల తల్లులకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటి వెయ్యి రోజులు అనగా గర్భం దాల్చిన మొదటి రోజు నుండి పిల్లలకు రెండు సంవత్సరాలు వయసు వచ్చేవరకు అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చిరుధాన్యాలు పప్పులు కూరగాయలు పండ్లు ఆహారంగా తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మంచి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. పిల్లల పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి ప్రేమతో కూడిన సంరక్షణ ఇవ్వాలని సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు చిన్నపిల్లల తల్లులు తడకండ్రిగ అంగన్వాడి టీచర్లు అనిత, సుమలత, వెంకటమ్మ, మీన, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని పండగకు సిద్ధమౌతున్న మండపాలు

**-ఆకర్షణీయంగా పందిళ్ళు, విద్యుత్ దీపాలంకరణలు, వివిధ రూపాల్లో వెలయనున్న ప్రతిమలు**



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణం వినాయక చవితి సంబరాలకు సిద్ధమౌతుంది. శ్రీకాళహస్తిలోని మూల మూలల్లోనూ, నాలుగు మాడా వీధుల్లోనూ వినాయచవితి సంబరాలకు భారీ ఎత్తున నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. శ్రీకాళహస్తి పట్టణంలో హైదరాబాదు తరహాలో వినాయక చవితి సంబరాలు భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించుటకు ఉత్సాహం చూపుతున్నారు. ఏర్పాట్లలో యువకులు చురుగ్గా చందాలు వసూలు చేసుకొంటూ ఏర్పాట్లలో తలమునలకయ్యారు. పరిచయాలున్న చోట్లల్లా వసూలు చేసుకుంటున్నారు.ఇప్పటికే వీధుల్లోనూ,నవసంధి వినాయక ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

**ఉత్సవాలకు ఎనలేని ప్రాధాన్యత:**

పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పండగలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో గత 25 సంవత్సరాలుగా వినాయకచవితి సంబరాల్ని హైదరాబాదును మరిపించే విధంగా నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రధానంగా పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం,పెండ్లి మండపం వద్ద ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి యువకులు నాలుగుమాడావీధుల్లోని వ్యాపారస్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తు న్నారు. చవితి సంబరాలు 5 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. అంతేకాక పట్టణంలోని వినాయక విగ్రహాల్ని ఏర్పాటు చేసి మూడు,ఐదు, ఏడు రోజులు సంబరాలు జరిపి నిమజ్జనం చేయటం జరుగుతుంది.

**ప్రైవేటు వ్యక్తులచే ఏర్పాట్లు:**

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ప్రైవేటు వ్యక్తులు తాము వసూలు చేసిన మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అంతేకాక పట్టణంలో నెలకొన్న పరిస్థితి దృష్ట్యా గతంలో 'వినాయక చవితి సంబరాల నిర్వహణ' కమిటి ఏర్పాటు చేశారు. ఇప్పటికే పట్టణంలోని వీధి వీధుల్లో చవితి సంబరాలకు పందిళ్ళు రోడ్ల మీద వెలిశాయి. ఇప్పటికే బేరివారి మండపం వద్ద చవితి సంబరాలకు సిద్ధం చేస్తున్నారు. పందిళ్లు వేసారు. ఇక్కడ లోకకళ్యాణార్థం హోమాలు నిర్వహించటం ఆనవాయితి.ఇక్కడ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పర్యవేక్షణలో చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది ఇక్కడ మట్టి వినాయక ప్రతిమను బెంగుళూరు నుంచి తెప్పిస్తున్నారు. ఇక పెండ్లిమండపం వద్ద 14 అడుగుల 'కర్కాటక రాశి వినాయకుని' రూపకల్పన చేసారు. ఈ బొమ్మను మంగళంలో తయారు చేయించారు. వినాయక చవితి సందర్భంగా నాలుగుమాడావీధుల్లో వెలసిన నవసంధి వినాయక ఆలయాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె అందించే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో వినాయక చవితి పర్వదినాన దేవస్థానం నుంచి సారె అందించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఇఒ తెలిపారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా...విస్తృత ఏర్పాట్లు

**-గ్యాలరీల్లో సకల సదుపాయాలు**



తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి అదనపు ఈఓ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో మాఢ వీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశామని,,భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ఉదయం, రాత్రి వాహనసేవల సమయంలో గ్యాలరీల్లో, మాఢవీధుల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని విధాలా సదుపాయాలు ఉంటాయన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో ఆద్యాత్మికతతో రంగవల్లులు తీర్చిదిద్దడం, బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు, వంటి పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. మాఢవీధుల్లో భక్తులకు అసౌకర్యం లేకుండా మరింత ఏర్పాట్లుపై సూచనలు చేశారు. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా సూచికబోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. భక్తుల రద్దీ నియంత్రణ, క్రమబద్దీకరణ ప్రశాంతంగా ఉండాలన్నారు.

## కథలతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన




రేణిగుంట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడిలోని అమర రాజా ఆడిటోరియంలో అమర రాజా విద్యాలయం ఆధ్వర్యంలో అంతర పాఠశాలల ఆంగ్ల కథల పోటీ 'కథోత్సవ్-2026' శుక్రవారం ఘనంగా జరిగింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఇతివృత్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 17 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కథన నైపుణ్యాన్ని ప్రదర్శించారు.శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్ల భాష, సాహిత్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి. హరి పద్మ రాణి, అమర రాజా గ్రూప్ ప్రధాన సుస్థిరత అధికారి ప్రశాంత్ తివారి, అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థ సీనియర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా, న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కథలు చెప్పడం ఒక విశిష్టమైన కళ అని, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను కథల రూపంలో ఎంచుకుని విద్యార్థులు సృజనాత్మకంగా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో దిగువమాఘం అమర రాజా విద్యాలయానికి చెందిన బి. వైష్ణవి ప్రథమ బహుమతి సాధించారు. కరకంబాడి అమర రాజా విద్యాలయానికి చెందిన సి. దేవసు వర్షిణి ద్వితీయ బహుమతి, శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన సి. ఝాన్సీ తృతీయ బహుమతి అందుకున్నారు.విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అమర రాజా విద్యాలయం ప్రిన్సిపాల్ గ్లోరి దేవ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ పూజ, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతు బజార్‌కు అదనపు నిధులు మంజూరు చేయాలి

**-మంత్రిని కోరిన విజయ్‌బాబు**



పుత్తూరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : పుత్తూరు పట్టణంలో రైతుబజార్ నిర్మాణానికి విడుదల చేసిన 23 లక్షలకు అదనంగా మరో 27 లక్షలు మంజూరు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. శుక్రవారం విజయవాడలో మంత్రిని కలిసి చర్చించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది నవంబరు 28వ తేదీన పుత్తూరు, నగరి పట్టణాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రికి తాను వినతిపత్రం ఇచ్చినట్టు గుర్తు చేశారు. తన అభ్యర్థన మేరకు పుత్తూరులో రైతు బజారు ఏర్పాటుకు తొలి విడత నిధులు మంజూరు చేసినందుకు మంత్రికి విజయ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. నగరిలో కూడా రైతుబజార్ ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## సెల్ ఫోన్ కోసం బావిలోకి దిగి... ఇద్దరు వలస కూలీలు మృతి

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: కేవలం సెల్ఫోన్ కోసం ఇద్దరు వలస కూలీలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని యస్‌బిఐ ట్రైనింగ్ సెంటర్ వెనకాల శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. అలిపిరి సీఐ రామ్ కిషోర్ సమా చారం మేరకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వలస కూలీలు తిరుపతి సమీప ప్రాంతాల్లో కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో తిరుపతి యస్‌బిఐ ట్రైనింగ్ సెంటర్ వెనకాల వున్న బావిలో భీమ్ రాజ్ వయస్సు 36 చరవాణి పడిపోవడంతో దుప్పట్లను పెనవేసుకుని బావిలోకి దిగారు. ఎంతసేపు కి బావిలో వెళ్లిన తన సహచరుడు రాకపోవడంతో నరేష్ వయస్సు 21 కూడా బావిలో దిగి కాపాడే ప్రయత్నం చేసి తను కూడా బావిలోనే మునిగిపోయాడు. సమాచారం అందుకున్న అలిపిరి పోలీసులు ఫైర్ ఇంజన్ ఘటన స్థలానికి చేరుకుంది. విషవాయులు పీల్చడం కారణంగా వలస కూలీలు మృతి చెంది ఉండవచ్చని ఫైర్ సిబ్బంది కూడా బావిలోకి దిగలేదు. అనంతరం పాతాలబేరి సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. అనంతరం మృతదేహాలను రూయ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మైనర్ బాలికపై రేప్ కేసులో ముద్దాయి అరెస్ట్!

**- నిందితుడుపై పోక్సో కేసు నమోదు**

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: తిరుపతిలో ఐదు నెలల క్రితం నమోదు కాబడ్డ ఫిర్యాదు మేరకు మైనర్ బాలికపై అత్యాచారం పోక్సో కేసు నమోదు చేయబడిన ఘటన వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ రామకృష్ణ సమాచారం మేరకు ఈ సంవత్సరం మార్చ్ 30వ తారీకు మైనర్ బాలికపై వెస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బాధిత మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలియడంతో ఇందిరా నగర్‌కు చెందిన డి మస్తాన్‌ను పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు తరలించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## జనసేన అభ్యర్థిగా కృష్ణయ్య పేరు ప్రతిపాదన



బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక మరియు ఆశావహుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించడం జరిగింది. ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు నాయకత్వంలో, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. పార్లమెంటరీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి మున్సిపల్ ఎన్నికలపై ఆశావహుల నుంచి ఫీడ్‌బ్యాక్ మరియు అభిప్రాయాలను సేకరించడం జరిగింది. సందర్భంగా వెంకటగిరి మున్సిపాలిటీ నుంచి తోట కృష్ణయ్య అభ్యర్థిగా పోటీ చేయాలనే తన అభిప్రాయాన్ని తెలియజేయడం జరిగింది. కిరణ్ రాయల్, కీర్తన, క్రికెట్ విజయ్ తదితర నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు హాజరై కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు తెలియజేశారు.

## 12 మందితో జాతర సేవా కమిటీ ఏర్పాటు

బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతర ఈ నెల 30, అక్టోబర్ నెల ఒకటో తేదీ జరగనున్న సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ 12 మందితో సేవ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 16వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు సేవా కమిటీ సేవలు వినియోగించు కోవాలని కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. గొల్ల గుంట మురళీకృష్ణ, తాండవ చంద్రశేఖర్, పుత్త శివప్రసాద్, టీవీ కృష్ణ, పులికల్లు జగదీశ్వరి, కలపాటి నాగమణి, రామారావు అనిల్, అనగానే వెంకటయ్య, చెంజి తిరుపాల్రెడ్డి, యం సావిత్రమ్మ, వేదగిరి సత్య సాయి కిరణ్మయి, టీ ప్రసాదులను నియమించారు.

## ఉద్యోగుల సమ్మెతో మూతపడ్డ బ్యాంకులు

బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: డిమాండ్ల సాధనకు శుక్రవారం బ్యాంకు సిబ్బంది సమ్మె చేశారు. బ్యాంకు సిబ్బంది సమ్మె కారణంగా ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. ప్రతి శనివారం సెలవు కావాలని, ఒక బోనస్ ఆధారంగా ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. శుక్రవారం బ్యాంకు సిబ్బంది సబ్బు చేస్తున్నరతో రెండో శనివారం, ఆదివారం, సోమవారం వినాయక చవితి కావడంతో నాలుగు రోజులు బ్యాంకులను మూసి వేస్తారు. నాలుగు రోజులు బ్యాంకు ఖాతాదారులు ఇబ్బంది పడనున్నారు.

## ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల : ఎంపీడీవో



బాలాయపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్నికల సంఘం వారు జారీ చేసిన షెడ్యూల్ మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 2026కు సంబంధించి తయారు చేయబడిన ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. ప్రచురించిన విషయంను అన్ని గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డు నందు సూచిక బోర్డులో ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

## కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



తడ,సెప్టెంబరు 11 ప్రభాతవార్త : తడ మండలం కారూరు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. కారూరు గ్రామంలో రేషన్ బియ్యం తరలింపు విషయంలో చోటు చేసుకున్న వివాదంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గాయపడ్డాడు అది తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శుక్రవారం కారూరు గ్రామానికి విచ్చేసి కార్యకర్తల పరామర్శిం చారు ఘటనకు సంబంధించిన విషయంపై విచారణ జరిపి వెలుగులోకి తీసుకొస్తామని రేషన్ బియ్యం తరలిస్తున్న నిందితులను శిక్షి ంచే విధంగా చర్యలు చేపడతామని కార్యకర్తకు భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో తడ వైసిపి కన్వీనర్ కెలివి ఆర్ముగం మండలంలోని వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



## లక్షన్నర గాజులతో అన్నపూర్ణాదేవి అలంకారం

శ్రావణ మాసం చివరి శుక్రవారం అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవాలయంలో అమ్మవారికి సాయంకాలం లక్షన్నర (1.50) గాజులతో అమ్మవారి అలంకారం దర్శనమిచ్చింది.

ప్రభాతవార్త-తిరుపతి

## ఆర్టీసీ ఆర్‌ఎంకు శుభాకాంక్షలు తెలిపిన స్టార్ కృష్ణ

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : ఇటీవల తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును తిరుపతిలోని వారి కార్యాలయంలో ఆర్టీసీ బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్‌కృష్ణ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సత్కరించి బుద్ధ భగవాన్ చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టార్‌కృష్ణ మాట్లాడుతూ దళిత బహుజన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అందుకు ఆర్.ఎం. శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈ. వాసు,కె అంజప్ప, టి కె.స్వామి, మాజీ డి.ఎం. జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యస్వీయూలో ప్రతిష్ఠాత్మక లెక్చర్ రికార్డింగ్ స్టూడియో

**రూ.90 లక్షలతో లెక్చర్ రికార్డింగ్, ఏఆర్-వీఆర్, పాడ్‌కాస్ట్ సదుపాయాలు**



తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ఆధునిక సాంకేతికతను విద్యా బోధనలోకి తీసుకురావడంలో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మరో కీలక సదుపాయం అందుబాటులోకి వచ్చింది. రూసా-2.0 ప్రోగ్రామ్ కింద ఏర్పాటు చేసిన లెక్చర్ రికార్డింగ్ స్టూడియో, ఏఆర్-వీఆర్ వర్చువల్ ప్రొడక్షన్, పాడ్‌కాస్ట్ స్టూడియోలను గురువారం ప్రారంభించారు. కేంద్రీయ సంస్థల్లో అందుబాటులో ఉండే స్థాయి సదుపాయాలను యస్వీయూలో ఏర్పాటు చేయడం విశేషం. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు స్టూడియోలను ప్రారంభించారు. రూసా కోఆర్డినేటర్లు ఆచార్య సుచరిత, ఆచార్య బాలాజీ, సీఈఓ వంశీ, ప్రిన్సిపాళ్లు ఆచార్య సుధారాణి, ఓవియస్ రెడ్డి, శ్రీనివాసులు, ఇంజనీర్ తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.యస్వీయూ అధ్యాపకులతో కలిసి ఆన్‌లైన్ లెక్చర్ వీడియోలను రూపొందించడం ఈ స్టూడియో ప్రధాన ఉద్దేశమని రూసా కోఆర్డినేటర్లు తెలిపారు. భవిష్యత్తులో ఏఆర్-వీఆర్ సాంకేతికతపై సర్టిఫికెట్, మాస్టర్ కోర్సులను ప్రారంభించే దిశగా ఈ సదుపాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వర్చువల్ ప్రొడక్షన్, ఏఆర్-వీఆర్ మిక్సింగ్ కోసం ఇతర సంస్థలు స్టూడియోను వినియోగించుకునే అవకాశం కల్పించి అద్దె రుసుముల ద్వారా విశ్వవిద్యాలయానికి ఆదాయం సమకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. స్టూడియో అభివృద్ధికి రూసా-2.0 కింద రూ.90 లక్షల నిధులను వినియోగించినట్లు తెలిపారు. స్టూడియో రూపకల్పన, సాంకేతిక అభివృద్ధిలో చెన్నై ఐఐటీ సహకారం అందించినట్లు రూసా కోఆర్డినేటర్లు వెల్లడించారు. ఆధునిక బోధనా విధానాలకు అనుగుణంగా డిజిటల్ కంటెంట్ రూపకల్పనకు ఈ స్టూడియో కీలక వేదికగా నిలవనుంది.

**పేరు మార్పు**

యస్.సైదుబీరాం సాబ్, తండ్రి యస్.కాసిం సాహెబ్, డోర్ నెం.6-3, మెయిన్‌రోడ్డు, చిన్న గొట్టిగల్లు, చిన్నగొట్టిగల్లు మండలం, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉండు, నేను నా పేరును యస్.సాహెబ్‌పీర్ నుండి యస్. సైదు బీరాం సాబ్ గా మార్చుకుంటున్నాను. ఇక మీదట నేను యస్.సైదుబీరాం సాబ్ గా పిలవబడుతాను.

# తిరుపతి డివిజన్

# ప్రతి పాఠశాలలో వంద శాతం ఫలితాలే లక్ష్యం



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఒక్క విద్యార్థి కూడా వెనుకబడకుండా.. ప్రతి పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా తిరుపతి జిల్లా విద్యాశాఖ కార్యాచరణకు పదును పెడుతోంది. మార్చి-2027 ఎస్ఎస్సీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మిషన్ మార్చ్-ఎస్ఎస్సీ 2027లో భాగంగా నిర్వహించిన సబ్జెక్టు ఉపాధ్యాయుల అవగాహన శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. జిల్లాలోని ఐదు డివిజన్ల పరిధిలో సుమారు 2 వేల మంది పదో తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సాంఘికశాస్త్రం సబ్జెక్టుల వారీగా శిక్షణ నిర్వహించారు. సబ్జెక్టు నిపుణుల ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో సవరించిన పరీక్షా విధానం, ప్రశ్నపత్రం నిర్మాణం, బ్లూప్రింట్, మార్కుల విభజన, మోడల్ పేపర్ల వినియోగం, కాంపిటెన్సీ ఆధారిత ప్రశ్నలు, సమయ నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రశ్నను అర్థం చేసుకుని సమర్థవంతంగా సమాధానం రాసేలా తరగతి గది బోధన సాగించాలని సూచించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, పుత్తూరు, కోడూరు డివిజన్ల పరిధిలోని మండలాలను కేంద్రాల వారీగా విభజించి శిక్షణ ఇచ్చారు. ఆయా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలు, బోధనలో ఎదురవుతున్న సవాళ్లు, విద్యార్థుల అభ్యసన స్థాయిపై చర్చించారు. శిక్షణ ద్వారా పొందిన ప్రయోజనాలు, భవిష్యత్తులో అవసరమైన అంశాలపై ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ ఫీడ్‌బ్యాక్ తీసుకుంది. జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ స్వయంగా పలు శిక్షణా కేంద్రాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయిని ముందుగానే గుర్తించి, వెనుకబడిన వారికి ప్రత్యేక రెమీడియల్ బోధన, అదనపు సాధన, వ్యక్తిగత శ్రద్ధ అందించాలని సూచించారు. విద్యార్థులను మొబైల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉంచి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని డీఈఓ కె.వి.ఎన్. కుమార్ సూచించారు. ప్రతి పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందస్తు కార్యాచరణ కొనసాగుతుందని డీఈఓ కె.వి.ఎన్. కుమార్

## వినాయకుడిని మలిచిన చేతులు

-శ్రీరామ విద్యార్థుల వినూత్న కార్యక్రమం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



ఒకవైపు భక్తి.. మరోవైపు పర్యావరణ బాధ్యత. ఈ రెండింటినీ మేళవిస్తూ శ్రీరామా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వినాయక చవితికి వినూత్న కార్యక్రమం చేపట్టారు. మార్కెట్‌లో లభించే విగ్రహాలను కొనుగోలు చేయడం కాకుండా.. తామే మట్టిని సేకరించి, తమ చేతులతో వినాయక విగ్రహాలను తయారు చేశారు. అనంతరం వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటారు. వినాయక చవితిని పురస్కరించుకుని కళాశాలకు చెందిన ఐఈఈఈ స్టూడెంట్ చాప్టర్, జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో మట్టి విగ్రహాలను తయారు చేసి, వాటి ప్రత్యేకతను ప్రజలకు వివరించారు. పండుగ కోసం విగ్రహాన్ని తయారు చేయడమే కాకుండా, మట్టి వినాయకుడి వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు వివరించారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వాసు, కోఆర్డినేటర్లు డాక్టర్ ఏ. మునిశంకర్, ఎస్. చక్రిధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత వినాయకుడే మేలు

-ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. భీమన్న



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. భీమన్న సూచించారు. కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు వినాయక చవితి వేడుకల్లో ఆయన అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి మట్టి, బియ్యం పిండితో తయారు చేసిన వినాయక ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భీమన్న మాట్లాడుతూ బంకమట్టి, బియ్యం పిండి వంటి సహజ పదార్థాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. పర్యావరణహిత వినాయక చవితి వేడుకలపై ప్రజల్లోనూ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి. జ్యోతి, అధ్యాపకులు జ్ఞాన ప్రసూన, డి.కె. భావన, ఎకో క్లబ్ సభ్యులు డాక్టర్ వరప్రసూన, డాక్టర్ యామిని, డాక్టర్ భద్రమణి, డాక్టర్ విద్యుల్లత, సాయికుమారి, డాక్టర్ సునీత, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శిరీష, డాక్టర్ వసుధ, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ జయశ్రీతో పాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాల్లో యస్వీయూకు మరో గుర్తింపు



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

విద్యా నాణ్యత, పరిశోధన, పర్యావరణ పరిరక్షణ, శక్తి నిర్వహణలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మరో ముందడుగు వేసింది. విద్యా సేవలు, శక్తి నిర్వహణ, పర్యావరణ నిర్వహణ, లింగ సున్నితత్వానికి సంబంధించి పలు ధ్రువీకరణలను యస్వీయూ పొందింది. విశ్వవిద్యాలయం వైరాలజీ ప్రయోగశాలలకు ఐఎస్ఓ/ఐఈసీ 17025:2017 అక్రిడిటేషన్ కూడా లభించింది. మట్టి, నీరు, ఆహారం, పర్యావరణ నమూనాల నిర్దిష్ట పరీక్షలతో పాటు యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్ ప్రభావశీలత అంచనా, మొక్కల వ్యాధికారకాల గుర్తింపు వంటి పరీక్షలకు ఈ అక్రిడిటేషన్ వర్తిస్తుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ నాణ్యమైన విద్య, పరిశోధనలో శ్రేష్ఠత, పర్యావరణ సుస్థిరత, సమ్మిళిత ప్రాంగణం పట్ల యస్వీయూ నిబద్ధతకు ఈ గుర్తింపులు నిదర్శనమన్నారు. జిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ సమన్వయంతో కూడిన కృషి, క్రమబద్ధమైన డాక్యుమెంటేషన్, నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడి పనిచేయడం వల్ల ఈ ధ్రువీకరణలు, అక్రిడిటేషన్ సాధ్యమయ్యాయని తెలిపారు. వైరాలజీ విభాగం ఆచార్య జి. నరసింహులు ఐఎస్ఓ ధ్రువీకరణ ప్రక్రియకు విశ్వవిద్యాలయ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా యస్వీయూ వీసీ

-ఆచార్య టాటా నరసింగరావుకు అరుదైన గౌరవం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఆచార్య టాటా నరసింగరావుకు అరుదైన గౌరవం దక్కింది. భారతదేశంలో ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఎన్ఏఎస్ఐ) ఫెలోగా ఆయన ఎంపికయ్యారు. శాస్త్ర, పరిశోధనా రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. 1930లో స్థాపించబడిన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న 96వ వార్షిక సదస్సులో ఆచార్య నరసింగరావుకు ఫెలోషిప్ ప్రదానం చేయనున్నట్లు అకాడమీ ప్రకటించింది. 2027 జనవరి 1 నుంచి ఫెలోగా ఎంపికైన వారు తమ పేర్ల పక్కన ఎఫ్.ఎన్.ఏ.ఎస్.సి. గుర్తింపును ఉపయోగించుకోవచ్చని తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన ఆచార్య టాటా నరసింగరావు దేశంలోని కొద్దిమంది ప్రముఖ శాస్త్రవేత్తల సరసన ఈ ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌కు ఎంపిక కావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతిని విశ్వవిద్యాలయ ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## ఇస్కాన్ పోటీల్లో పద్మావతి కళాశాల విద్యార్థినుల ప్రతిభ

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**




శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ డా. సి.భువనేశ్వరి, భవాని ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత ఉపనిషత్తుల సారాన్ని అందించే గ్రంథమని పేర్కొన్నారు. నిత్య జీవితంలో భగవద్గీతను శ్రవణం, పఠనం, మననం, ధారణ వంటి విధానాల ద్వారా ఆచరించడం వల్ల ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. ఇస్కాన్ నిర్వహించిన పోటీల్లో టి. గురుభాను లహరి, జి.తరుణిక, ఎన్. స్నేహలత, సిహెచ్. మనుశ్రీ, వై.అనుశ్రీ, కె. ప్రియాంక, వి.జయశ్రీ, వి.హేమసాయి, వి.మానస, బి.శాంతి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

## తిరుపతి పోలీసులు వివిధ కేసుల్లో పురోగతి

- ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, బంగారు గొలుసు సహా రూ.13.80 లక్షల విలువైన ఆస్తి రికవరీ
- వృద్ధురాలి బంగారు గొలుసు చోరీ కేసును 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు
- నిందితులను అరెస్ట్ చేసి చోరీకి గురైన వాహనాలు, బంగారం స్వాధీనం.

**తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తమ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు దొంగతనాల కేసులను సమర్థవంతంగా ఛేదించారు. ఈ సందర్భంగా కేసుల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం తిరుపతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మరియు అడిషనల్ ఎస్పీ కె.రవి మనోహరాచారి శుక్రవారం వెల్లడించారు. ఇందులో భాగంగా వారి సమాచారం మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జమ్మలమడుగుకు చెందిన గొంగాటి మల్లికార్జున్ రెడ్డి, వయస్సు 38 ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి సుమారు రూ.9 లక్షల విలువైన ట్రాక్టర్, ట్రాలీని రికవరీ చేశారు. విచారణలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో ట్రాక్టర్ దొంగతనానికి సంబంధించిన ఇంజిన్‌ను కూడా దొంగిలించినట్లు వెల్లడించడంతో, దానికి సంబంధించిన సుమారు రూ.1.50 లక్షల విలువైన ఇంజిన్‌తో పాటు సంబంధిత ట్రాలీని కూడా పోలీసులు రికవరీ చేశారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు: రోడ్డుపై తాళం వేసి వదిలిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న దాయనబోయిన రవి, వయస్సు 55 సం.ను సాంకేతిక ఆధారాలతో గుర్తించి, మరో వాహనం దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన హీరో ప్లెజర్, రూ.50 వేల విలువైన హీరో స్ప్లెండర్ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పిడుగురాళ్లకు చెందిన శివరాత్రి చందు, వయస్సు 23 సం., దొంగిలించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను సాంకేతిక ఆధారాలను ట్రాక్ చేసి నిందితుడిని అరెస్టు చేసి, సుమారు రూ.90 వేల విలువైన వాహనాన్ని రికవరీ చేశారు. మొత్తం మూడు ద్విచక్ర వాహనాలు, సుమారు రూ.1.90 లక్షల విలువైన ఆస్తిని పోలీసులు రికవరీ చేశారు.



**- వృద్ధురాలి బంగారు గొలుసు చోరీ కేసు:** వృద్ధ మహిళ మెడలో నుంచి 35 గ్రాముల బంగారు గొలుసును అపహరించిన చైన్ స్నాచింగ్ కేసులో తిరుపతి డీఎస్పీ పర్యవేక్షణలో ఈస్ట్ సీఐ, ఎస్ఐలు, ఐడీ పార్టీ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితురాలు గిద్దలూరుకు చెందిన కొప్పాలి గీత, వయస్సు 25 సం., ను కేవలం 24 గంటల్లోనే గుర్తించి అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి సుమారు రూ.1.40 లక్షల విలువైన 35 గ్రాముల బంగారు గొలుసును రికవరీ చేశారు. ఈ కేసుల్లో సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని సమన్వయం చేసుకుని దర్యాప్తు చేపట్టడం ద్వారా మొత్తం ఐదు కేసులలో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.13.80 లక్షల విలువైన చోరీ ఆస్తిని పోలీసులు రికవరీ చేయడమైనది. దొంగలేచ్చిన వస్తువులను తిరుపతి జిల్లా పోలీసు అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు అభినందించారు.



## ద్వాదశ భావాలపై విస్తృతంగా ఉపన్యాసం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



జ్యోతిషశాస్త్రంలోని ద్వాదశ భావాల ప్రాధాన్యతపై జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ప్రత్యేక విస్తృత ఉపన్యాస సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నదారు భవన్‌లో జ్యోతిష విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ సదస్సులో ప్రముఖ జ్యోతిషశాస్త్ర పండితుడు డా. కృష్ణచంద్ర కవి ముఖ్య అతిథిగా పాల్గొని ˊద్వాదశ భావాలు̥ అంశంపై విస్తృతంగా ఉపన్యసించారు. ఆధునిక కాలంలో జ్యోతిష జ్యోతిష ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, శాస్త్రంలోని వివిధ అంశాలను, సంస్కృత భాషలో నిక్షి ప్తమైన వైజ్ఞానిక విశిష్టతను డా. కృష్ణచంద్ర కవి వివరించారు. అధ్యయనంలో ద్వాదశ భావాల అవగాహన కీలకమని పేర్కొంటూ పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. డీన్ ఆఫ్ వేద, వేదాంగ, జ్యోతిష విభాగాధిపతి ప్రొ. కృష్ణేశ్వర్ ఝా అధ్యక్షోపన్యాసం చేశారు. పురాణ విభాగాధిపతి ప్రొ. పారమిత పాండా విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డా. వి. ధర్మదాసన్ వందన సమర్పణ చేయగా, డా. చిత్తరంజన్ నాయక్ కార్యక్రమ నిర్వాహకుడిగా వ్యవహరించారు. జ్యోతిష విభాగ అధ్యాపకులు డా. కృష్ణకుమార్ భార్గవ్, డా. బాలాక్రాంత్ సరస్వత్, డా. అశ్వినీకుమార్‌తో పాటు విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడి తయారీపై విద్యార్థుల ఆసక్తి

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ జీవకోనలోని విశ్వం హైస్కూల్ ప్రాంగణంలో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. అనంతరం వినాయకుడి చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డా. ఎన్. విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు కళలు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు విద్యాసంస్థల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమం భక్తి భావనతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, పర్యావరణ బాధ్యతను పెంపొందించేలా సాగింది.

## అత్యాధునిక పరిశోధనకు యస్వీయూలో ఊతం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**




అత్యాధునిక పరిశోధనా పరికరాలతో అంతరశాస్త్రీయ పరిశోధనలకు వేదికగా నిలుస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాల యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బయోఎనర్జీ ఇన్నోవేషన్స్‌ను ఉపకులపతి ఆచార్య టాటా నరసింహరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సందర్శించారు. సెంటర్‌లో అందుబాటులో ఉన్న పరిశోధనా సదుపాయాలు, పరికరాల వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఈటీ (బ్రునౌర్-ఎమ్మెట్-టెల్లర్) సర్ఫేస్ ఏరియా ఎనలైజర్ పనితీరును శాస్త్రవేత్తలు అధికారులకు వివరించారు. ఈ పరికరం ద్వారా వివిధ పదార్థాల ఉపరితల వైశాల్యం, రంధ్ర పరిమాణం, రంధ్రాల పరిమాణ పంపిణీ వంటి భౌతిక లక్షణాలను కచ్చితంగా విశ్లేషించవచ్చని తెలిపారు. బయోఎనర్జీ, బయోమెటీరియల్స్, నానోసైన్స్, పర్యావరణ సాంకేతికత తదితర రంగాల్లో పరిశోధనలకు ఇది కీలకంగా ఉపయోగపడుతుందని వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వెంకటేశ్వర్లు సైతం సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఓ డైరెక్టర్ శివయ్య, రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ నరసింహ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బయోఎనర్జీ ఇన్నోవేషన్స్ కోఆర్డినేటర్ ఆచార్య పరమగీతం తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ బాటిళ్ల వాడకంతో అనారోగ్య సమస్యలు!




**తిరుపతి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

**డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి**

ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా అంతర్జాతీయ కాంగ్రెస్ బిడ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బి.హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా గాజు లేదా స్టెయిన్లెస్ స్టీల్ బాటిళ్లను వినియోగించడం ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు చేస్తుందన్నారు. శుక్రవారం జేసీఐ తిరుపతి పవర్ ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రి పారిశుధ్య సిబ్బందికి ఉచితంగా స్టెయిన్లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు నీటిలో కలిసే అవకాశం ఉందని, అవి శరీరంలోకి చేరితే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. హార్మోన్ల అసమతుల్యత, మూత్రపిండాల సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు పర్యావరణ, జల కాలుష్యాన్ని పెంచుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఐ తిరుపతి పవర్ అధ్యక్షుడు పోకల గౌతమ్ కుమార్, జోన్ కోఆర్డినేటర్ ఆర్ శేషసాయి, ఈ త్రిషల, జెసిఐ జోన్ చైర్మన్ జి శంకరయ్య, జోన్ వైస్ చైర్మన్ గుణశేఖర్, జెసిఐ రీజినల్ బోర్డ్ చైర్మన్ నామా రాజేష్, గాజువాక ప్రెసిడెంట్ నర్మద ఏగిరెడ్డి, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

